క్లుప్తంగా

ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హైందవ సంఘాలు

ఓబులవారిపల్లె : ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జరిగిన రోజు సందర్భంగా రైల్వేకోడూరు పట్టణ కేంద్రంలో హైందవ సంఘం వారు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వానికి ప్రతీకని పేర్కొన్నారు. అనంతరం వివిధ క్షేత్రాల వారితో కలిసి రైల్వేకోడూరు పట్టణం ప్రధాన జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జల్లా కృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డీసీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

గాలివీడు : మండలంలోని నూలివీడు గ్రామం నాగురువాండ్ల పల్లెకు చెందిన మల్లేశ్వర స్వామి ఆలయ మాజీ ధర్మకర్త జల్లా కృష్ణారెడ్డి మృతి చెందడం పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, రమేష్ కుమార్ రెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా ఫోన్ ద్వారా వారు కుటుంబానికి దిగ్భ్రాంతి వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అలానే కృష్ణారెడ్డి మృతదేహం వద్ద మాజీ డీసీపీ జల్లా సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ ఉమాపతి రెడ్డిలు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. నేడు నగురువాండ్ల పల్లెలో కృష్ణారెడ్డి అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.


సబ్‌కలెక్టరేట్ వద్ద సీపీఐ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

రాజంపేట : రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లో సోమవారం రైల్వేకోడూరు సీపీఐ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నల్లపురెడ్డిపల్లె పంచాయతీలో జరుగుతున్న భూ కబ్జాలపై నిరసన గళం వినిపించారు. రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, పెనగలూరు మండల కార్యదర్శి గానిగపెంట ఆదినారాయణలు మాట్లాడుతూ కబ్జాదారుడు కొరముట్ల హరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1131 సర్వేనెంబరులో 30 ఎకరాలు కబ్జాదారునికి కట్టబెట్టారన్నారు. కార్యక్రమంలో ఓబులవారిపల్లె మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిండెంట్ దార్ల నాగేశ్వరరావు, పెనగలూరు మండల సహాయ కార్యదర్శి ఈరి లక్ష్మీనారాయణ, రైతుసంఘం నాయకులు తిప్పన కటారి, సీపీఐ కార్యవర్గ సభ్యులు రేవూరి శంకరయ్య, డీహెచ్‌పీఎస్ మండల కార్యదర్శి పందికాళ్ల శివశంకర్, సీపీఐ నాయకులు శివకుమార్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై వేణుగోపాలస్వామి



పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి హనుమద్ వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది. వాహన సేవలో భాగంగా వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామలు సమేతుడై పురవీధులలో ఊరేగారు. రాత్రికి హరికథా కాలక్షేపం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు. గ్రామంలోని రెడ్డిసంఘం వారు వాహన సేవ కార్యక్రమం నిర్వహించారు.

నేడు గరుడసేవ..

నేడు మంగళవారం స్వామివారు గరుడు వాహనంపై దర్శనమివ్వనున్నారు. ముదిరాజ్ సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించనున్నట్టు ఉత్సవ నిర్వాహకులు తెలియజేశారు. రాత్రికి హరికథ కాలక్షేపం ఉంటుందన్నారు.

వైభవంగా రథోత్సవం

కలికిరి: పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు సోమవారం స్వామివారి రథోత్సవం కార్యక్రమం వైభవంగా సాగింది. ఉదయం 10 గంటలకు ఆలయం నుంచి ప్రారంభమైన తేరును లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. ఇంటింటా మహిళలు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులిచ్చి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదు



రాజంపేట టౌన్ మాట్లాడుతున్న చిట్వేలి రవికుమార్



రైల్వేకోడూరులోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

రాజంపేట టౌన్ : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేయడంలో భాగంగా కార్మికులను అన్యాయంగా విధుల నుంచి తొలగించారని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్న డిమాండ్‌తో సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయ ఆవరణలో రవికుమార్ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగం వల్ల విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటైందని, అయితే కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా కార్మికులు ఐక్యంగా ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గతంలో బీజేపీ నాయకులు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేయమని తెలిపారని, అయితే అదే బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుండటం దుర్మార్గమన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవడంతో పాటు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఫ్యాక్టరీని నడపాలన్నారు. అందుకు భిన్నంగా కేంద్రం వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేయనున్నట్లు రవికుమార్ హెచ్చరించారు. అలాగే రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు కూడా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేట్‌పరం కాకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. లేకుంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నాయకులను ఎక్కడా తిరగనివ్వబోమని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పందికాళ్ల మణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, ప్రసాద్, ఓబయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సాదిక్‌బాషా, రాజ, మల్లారపు గురవయ్య, సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో నిరసన

ఓబులవారిపల్లె : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కింద పని చేస్తున్న 5400 మంది కార్మికులను తొలగించడం అన్యాయమని, తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు సోమవారం రైల్వేకోడూరు ప్రధాన కూడలి వద్ద ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేర రైల్వేకోడూరులోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలో భాగంగా కార్మికులను అధికంగా ఉన్నారని, ఎటువంటి బెనిఫిట్స్ లేకుండా నిర్దాక్షిణంగా కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న పరిశ్రమలను లక్షలాది మందికి ఉపాధి కలిపిస్తుంటే కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు దోచిపెడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు, ఏపీఎండీసీ పోరాట కమిటీ కన్వీనర్ ఆర్.వెంకటేష్, ఏపీఎండీసీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, సీఐటీయూ ఓబులవారిపల్లి మండల కార్యదర్శి నాగోతు పెంచలయ్య, విద్యుత్ కాంట్రాక్ట్, వర్కర్స్ యూనియన్ మండల నాయకులు ఎం.సుబ్బరాయుడు, ఆటో యూనియన్ నాయకుడు చెన్నూరు మురళీ, ప్రకృతి వ్యవసాయం సంఘం నాయకుడు చెంగల్ రాయుడు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : వైజాగ్ ఉక్కు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజనేయులు ఆరోపించారు. సోమవారం సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాల నాయకుల ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా విశాఖ పట్టణంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అడ్డుగోలుగా విభజించి ప్రత్యేక హోదా ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు తలమానికంగా ఉన్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధపడటం దారుణమన్నారు. దీనిని వ్యతిరేకించాల్సిన అధికార పక్షం అయిన టీడీపీ, జనసేన పార్టీలతో పాటు వైఎస్సార్ సీపీ నోరు మెదపకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడంలో భాగంగా తొలిదశలో 5400 మంది ఉద్యోగులకు నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అలాగే రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో దోచుకుంటోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యకర్తలు తిరుపాల్ చెన్నయ్య, నరసింహులు, ఓబులేసు, కాంతారావు, అశోక్, రమణ, మంగమ్మ, నాగమ్మ, శాంతమ్మలు పాల్గొన్నారు.



రాయచోటి టౌన్: సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

స్వర్ణాంధ్ర-2047 ద్వారా ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్

రాయచోటి : స్వర్ణాంధ్ర–2047 ద్వారా ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడం జరుగుతుందని రాష్ట్రమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా స్వర్ణాంధ్ర–2047, నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పది మూల్యాంకన విధుల పారితోషకం చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షల మూల్యాంకన విధులకు సంబంధించిన పారితోషికాన్ని వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. ఈ విషయమై సోమవారం సాయంత్రం కడప జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ మార్చి నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షల విధులకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టమెంట్ ఆఫీ సర్లు పరీక్షల నిర్వహణకు సొంత డబ్బు ఖర్చు పెట్టుకుని విధులు నిర్వహించారన్నారు. ఏప్రి ల్ నెలలో జరిగిన పదవ తరగతి మూల్యాంకన పారితోషకం కూడా చెల్లించలేదని, పరీక్షలు ముగిసి ఫలితాలు వెలువడినప్పటికీ పారితోషికం చెల్లించడంలో అలసత్వం వహించడం మంచిది కాదన్నారు.

సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్



కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

సిద్దవటం : లంకమల అభయారణ్యంలోని సమస్యాత్మక ప్రదేశాలలో కూబింగ్ నిర్వహించామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో సోమవారం రేంజర్ మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు సిద్దవటం ఫారెస్టు రేంజ్ పరిధిలోని గొల్లపల్లె, రోళ్లబోడు, సిద్దవటం ఫారెస్టు బీట్‌లలోని సమస్యాత్మక, అనుమానిత ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతాల్లోని సమీప గ్రామాల్లో ప్రజలకు ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనబడితే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అటవీ సంపద కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అటవీ ప్రాంతానికి అనుకుని ఉన్న పంట పొలాల్లోకి వన్య ప్రాణులు సంచరిస్తే వాటికి ప్రాణహాని తలపెట్టకుండా గ్రామస్తులు వెంటనే తమకు తెలియజేయాలని రేంజర్ అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేస్, ఫారెస్టు బీట్ ఆఫీసర్‌లు, అసిస్టెంటు బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూమి కాజేస్తున్నారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

రాయచోటి జగదాంబ సెంటర్ : అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం పున్నటివారిపల్లెకుచెందిన పొన్నటి సుభాషిణి అనే మహిళ అదే గ్రామానికి చెందిన వాసుదేవరెడ్డి, శ్రీనివాసులరెడ్డిలు తన భూమిని కాజేస్తున్నారంటూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 378/3లో 4.50 ఎకరాల భూమి 70 సంవత్సరాలకు పైగా తమ ఆధీనంలో ఉండగా పాసుపుస్తకాలు, డీ ఫారాలు కూడా ఉన్నట్లు తెలిపారు. కానీ వాసుదేవరెడ్డి, శ్రీనివాసుల రెడ్డిలు దొంగగా ఆన్‌లైన్ చేసుకుంటున్నారని ఈ విషయంపై ఓబులవారిపల్లె తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆమె కోరారు.

అరాచక పాలనకు అడ్డూ అదుపు లేదా?



సుదర్శన్ రెడ్డిని పరామర్శిస్తున్న కొరముట్ల

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అరాచక పాలనకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని రైల్వేకోడూరు మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డిపై దాడి చేసిన వారిని పోలీసులు తక్షణమే అదుపులోకి తీసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్వయంగా అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని, ఇలాంటి చర్యలు గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. అధికారం శాశ్వతం కాదని చంద్రబాబు తెలుసుకోవాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రంగారెడ్డి, సిహెచ్ రమేష్, బికె మణి తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు



లక్కిరెడ్డిపల్లె: కలెక్టర్ చేతులమీదుగా ప్రతిభా అవార్డు అందుకుంటున్న షేక్ అర్షియ



రాజంపేట టౌన్: ప్రతిభా అవార్డులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

రాజంపేట టౌన్ : ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు సత్తాచాటి అత్యధిక మార్కులు సాధించారు. దీంతో విద్యాశాఖ అధికారులు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను ప్రతిభా అవార్డుకు ఎంపిక చేసింది. కాగా జిల్లా కేంద్రమైన రాయచోటిలో సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా తమ కళాశాలకు చెందిన ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపునకు విద్యార్థిని పల్లవి (981 మార్కులు), అకౌంట్ అండ్ ట్యాక్సేషన్ గ్రూపునకు విద్యార్థిని వి.కవిత (972 మార్కులు), హెచ్‌ఈసీ గ్రూపునకు విద్యార్థిని టి.సంధ్య (941 మార్కులు), వి.లక్ష్మీప్రసన్న (908 మార్కులు) ప్రతిభా అవార్డును అందుకున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి.రమణరాజు ఇక్కడి విలేకరులకు తెలిపారు. జిల్లాలో మొత్తం 36 మందికి ప్రతిభా అవార్డులు రాగా తమ కళాశాల నుంచి అత్యధికంగా నలుగురు విద్యార్థినులు అవార్డులను పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అధ్యాపకుల కృషి ఫలితంగా ఇంటర్మీడియట్‌లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు.

నందలూరు : మండలంలోని మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివిన విద్యార్థిని అయినటువంటి వెంకట శైలజ పదవ తరగతి పరీక్షల్లో 579 మార్కులు సాధించింది. సోమవారం రాయచోటిలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో షైనింగ్ స్టార్స్ 2025 అవార్డును శైలజ అందుకుంది. ఈ అవార్డు తమ విద్యార్థిని అందుకోవటం చాలా గర్వంగా ఉందని అలాగే తమ పాఠశాల విద్యార్థుల



వెంకటశైలజ

నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నటువంటి ఉపాధ్యాయ బృందానికి ప్రిన్సిపల్ నాగేశ్వరి అభినందనలు తెలిపారు.

లక్కిరెడ్డిపల్లి : 2025 పదో తరగతి పరీక్షా ఫలితాలలో మండల ప్రథమ స్థానం సాధించిన విశ్వభారతి స్కూల్ విద్యార్థిని షేక్ అర్షియకు (583) ప్రతిభా అవార్డు వరించింది. సోమవారం రాయచోటి సుధా ఈవెంట్స్‌లో జరిగిన ప్రతిభా పురస్కారం అందజేత కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యంల చేతులమీదుగా రూ. 20 వేలు నగదుతోపాటు ప్రతిభా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకోవడం గర్వించదగ్గ విషయమని విశ్వభారతి పాఠశాల డైరెక్టర్ ఆర్.రామచంద్రయ్య, కరస్పాండెంట్ కె.రఘునాథరాజులు, విద్యార్థిని తల్లిదండ్రులు ఖాదర్ వలీ, మహబూబ్ జాన్‌లు పేర్కొన్నారు.


అక్రమ అడ్మిషన్ల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలలు ప్రారంభం కాకమునుపే అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని, ఆయా పాఠశాలలను విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న కోరారు. సోమవారం కడప నగరంలో రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కడప నగరం, బద్వేల్, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లె, పీలేరు నియోజకవర్గ ప్రాంతాల్లోని కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా పెద్ద,పెద్ద హోర్డింగ్స్ వేసి విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు.

గిరిజనులకు న్యాయం చేయండి

కేవీపల్లె : మండలంలోని మారేళ్ల పంచాయతీ మంచాలమందలో గిరిజనులకు న్యాయం చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంచాలమందలో గిరిజనుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకునే ప్రయత్నంతోపాటు గిరిజనులపై దౌర్జన్యానికి పాల్పడ్డవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాయలం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం మంచాలమందలో గిరిజన యానాదులకు 10.5 ఎకరాల భూమిని అప్పటి తహసీల్దార్ పట్టాలు ఇచ్చారని తెలిపారు. అప్పటినుంచి ఆ భూములను సాగు చేయడానికి గిరినులు ప్రయత్నిస్తున్నప్పటికీ గ్రామానికి చెందిన అగ్రవర్ణస్తులు అడ్డుపడుతూ వస్తున్నారని తెలిపారు. ఇటీవల ఆ స్థలంలో గిరిజనులు నివాస స్థలాలు ఏర్పరచుకోగా వాటిని దౌర్జన్యంగా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఓ గిరిజన వృద్ధుడు, యువతిపై దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. బాధితులు 11 రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు కిల్లా విజయ్‌కుమార్, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు ముల్లంగి చంద్రయ్య, ప్రజా సంఘాల నాయకులు రాజేష్, రెడ్డెప్ప, రవి పాల్గొన్నారు.

మేలైన వంగడాల సాగుతో మంచి దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన కళాశాల అధ్యాపకులు ముకుందలక్ష్మి

సుండుపల్లె : రైతులకు సలహాలు, సూచనలు చేసేందుకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. మండల కేంద్రంతోపాటు తిమ్మసముద్రం గ్రామాల్లో ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యాన కళాశాల అధ్యాపకురాలు ముకుంద లక్ష్మి మాట్లాడుతూ మామిడిలో అంతర పంటలైన పసుపు, అల్లం సాగు చేయాలని తెలిపారు. భారత నూనె గింజల పరిశోధన స్థానం డాక్టర్ పి.మీనా మాట్లాడుతూ రైతులు మంచి నాణ్యమైన వేరుశనగ విత్తనాలు ఎంపిక చేసుకోవాలన్నారు. అలా చేయడం వలన మంచి దిగుబడులు సాధించి, మంచి ఆదాయ ఉత్పత్తులను పెంపొందించుకోవాలని చెప్పారు. వేరుశనగలో కొత్త రకాలైన టీసీజీఎస్–1694, కే–1812, గిరినార్–4, 5 రకాలు, కందులు ఎల్ఆర్జీ 105 వంటి కొత్త రకాలు సాగు చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాషా రైతులకు డ్రోన్ సబ్సిడీపై అవగాహన కల్పించారు. రైతు సోదరులు రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పాటు చేసుకుని సంఘం ద్వారా వచ్చే ప్రయోజనాలను గురించి రైతు సోదరులకు వివరించారు. కార్యక్రమంలో ప్రశాంతి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఏపీఎస్ఎస్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యోగాను దినచర్యగా మార్చుకుందాం

ఆరోగ్యాన్ని ఇచ్చే యోగాను దినచర్యగా చేసుకొని జీవితాన్ని ఆనందమయంగా చేసుకుందామని అధికారులు తెలిపారు. యోగాంధ్రలో భాగంగా వివిధ మండలాల పరిధిలో యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని శాఖలకు చెందిన కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. వారు మాట్లాడుతూ యోగాతో అనేక లాభాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని కోరారు. యోగా ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి యోగా సాధన చేసేలా అవగాహన కల్పించారు. అనంతరం పలు రకాల యోగాసనాలపై శిక్షణనిచ్చారు. – సాక్షి, నెట్‌వర్క్



సంబేపల్లె: యోగాసనాలు వేస్తున్న అధికారులు



పెనగలూరు: యోగా నిర్వహిస్తున్న అధికారులు



పెనగలూరు: యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం



పుల్లంపేట: యోగాసనాలపై శిక్షణ



లక్కిరెడ్డిపల్లి: యోగాంధ్రకు ర్యాలీగా వెళ్తున్న దృశ్యం



ఒంటిమిట్టలో యోగాంధ్ర ర్యాలీ



సుండుపల్లె: యోగాంధ్ర ర్యాలీలో అధికారులు



సిద్దవటం: యోగాంధ్ర ర్యాలీ నిర్వహించిన దృశ్యం



నందలూరు : యోగాపై అవగాహన ర్యాలీ



గాలివీడులో యోగాంధ్ర ర్యాలీలో అధికారులు